సాక్షి రంగారెడ్డి
గురువారం । 5 । జనవరి । 2023



ఉపాధి హామీ పనులు భేష్
జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం బుధవారం రాచులూరులో పర్యటించింది. 8లో▸



పోలీసుల సహకారంతోనే..
పోలీసుల సహకారంతోనే స్టోన్‌క్రషర్ల నిర్వాహకులు రోడ్ల పక్కన ఉన్న నిర్మాణాలను తొలగించారని సీపీఐ నేతలు అన్నారు. 8లో▸



రాయితీలతో రాజీ పడొద్దు
పార్టీలకతీతంగా బీసీలంతా సంఘటితం కావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

ఎంపీ రంజిత్‌రెడ్డి



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: పేద ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్కేపల్లికి చెందిన ఎం.రాములు కుటుంబ సభ్యులకు బుధవారం నగరంలోని తన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల పేద ప్రజల సమస్యలను తీర్చడంలో సీఎం కేసీఆర్ ముందుంటారన్నారు. బీఆర్‌ఎస్ నేత వనం లక్ష్మీకాంత్‌రెడ్డితో కలిసి రాములు కుటుంబ సభ్యులకు రూ.80 వేల ఎల్‌ఓసీ అందజేశారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు రెఫరీగా చెన్నయ్య



షాద్‌నగర్ టౌన్: జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి 31వరకు గోవాలో నిర్వహించే జాతీయ స్థాయి కరాటే పోటీలకు పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ ఎత్తిన చెన్నయ్య న్యాయ నిర్ణేతగా ఎంపికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలి

యువజనోత్సవాలను ప్రారంభించిన మంత్రి తలసాని

రసూల్‌పురా: యువత పాశ్చాత్య ధోరణిని వీడి సన్మార్గంలో నడవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో యువజనోత్సవాలను మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని కోరారు. క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, పాశ్చాత్య సంస్కృతి బారిన పడి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. విద్య, క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మాట్లాడుతూ.. యువజనోత్సవాల్లో పాల్గొంటున్న విద్యార్థులు ప్రతిభ చాటాలని కోరారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారి సుధాకర్ రావు, అర్జున అవార్డు గ్రహీత అనుకుమార్, స్వర్ణలత పాల్గొన్నారు.

రెండో రోజూ మెరుపు సమ్మె

డిమాండ్ల సాధనకోసం మెట్రో కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

ఉప్పల్: వేతనాల పెంపు, న్యాయమైన డిమాండ్ల సాధనకు మెట్రోరైల్ కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం రెండోరోజు కొనసాగింది. విధులను బహిష్కరించిన కాంట్రాక్టు ఉద్యోగులు (రెడ్ లైన్) ఉప్పల్ మెట్రో డిపోవద్ద సమావేశమయ్యారు. నాలుగేళ్లుగా పని చేస్తున్నా కేవలం రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, కనీసం మెట్రోలో ప్రయాణించే అవకాశం కూడా ఇవ్వడం లేదని, లంచ్ బ్రేక్ కేవలం 15 నిమిషాలు మాత్రమే ఇస్తున్నారని, ఎనిమిది మంది చేయాల్సిన పనిని కేవలం నలుగురితోనే చేయించడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకోసం దేనికైనా సిద్ధమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మీడియా పెద్ద ఎత్తున మెట్రో డిపో వద్దకు చేరుకుంది. దీంతో మెట్రో సంస్థ యాజమాన్యం కాంట్రాక్టు ఉద్యోగులను చర్చలకు పిలిచారు. రూ.300 వరకు ఇంక్రిమెంట్‌లను అందజేస్తామని, మెట్రోలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, వారంలో ఒక రోజు సెలవును మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో కొందరు అంగీకరించారని తెలిసింది. మరికొందరు మాత్రం న్యాయమైన డిమాండ్లు సాధించుకునే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.


స్టాండింగ్ కమిటీలో 9 అంశాలకు ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ సర్కిల్‌లోని ఆదర్శనగర్‌లో మూడు కోట్ల రూపాయలతో వైకుంఠధామం అభివృద్ధికి బుధవారం జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌కమిటీ ఆమోదం తెలిపింది. మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్వహణ, అద్దెల స్థిరీకరణ, పలు ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఆస్తుల సేకరణ, కొన్ని ప్రాంతాల్లో మాస్టర్‌ప్లాన్‌లో మార్పులకు పచ్చజెండా ఊపింది. బంజారాహిల్స్‌లో జీహెచ్‌ఎంసీ పార్కును ప్రైవేట్‌కు దత్తత ఇచ్చేందుకు సభ్యులు సుముఖత వ్యక్తంచేశారు.

స్టడీ.. రెడీ

నిరుద్యోగులకు అండగా 'పబ్లిక్ రీడింగ్ రూమ్స్'

- పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో పది సెంటర్ల ఏర్పాటు
- నేడు మూడు కేంద్రాలను ప్రారంభించనున్న మంత్రి సబితారెడ్డి
- గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు తీరనున్న లైబ్రరీ కష్టాలు



కడ్తాల్ మండలం వాసుదేవపూర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమైన పబ్లిక్ రీడింగ్ రూమ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ ఉద్యోగాల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న యువత, నిరుద్యోగులకు అనుకూలంగా ప్రభుత్వం మరో గొప్ప నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ అభ్యర్థులకు గ్రంథాలయ సేవలను మరింత చేరువ చేయాలని భావించింది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో తొలిసారిగా పౌర పఠన కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి, కందుకూరు మండలం మాదాపూర్, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ సహా మరో ఏడు సెంటర్లను సిద్ధం చేసింది. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఏమాత్రం తీసిపోని విధంగా అధికారులు వీటిని తీర్చిదిద్దారు. గ్రూప్స్ సహా పోలీసు, ఉపాధ్యాయ ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించే అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, సాహిత్యం, చరిత్ర, పరిశోధక గ్రంథాలతో పాటు వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కోచింగ్ సెంటర్లు రూపొందించిన స్టడీ మెటీరియల్, తెలుగు, ఇంగ్లిష్ దినపత్రికలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేసింది.

మేజర్ పంచాయతీల్లో

జిల్లాలో కేంద్ర గ్రంథాలయం సహా 24 గ్రామీణ లైబ్రరీలు ఉన్నాయి. వీటిలో 3.63 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడికి రోజుకు సగటున రెండు నుంచి మూడు వందల మంది పాఠకులు వస్తున్నారు. రూ.10 లక్షలు ఖర్చు చేసి పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వం ఇటీవలే సమకూర్చింది. ప్రస్తుతం జిల్లా, మండల కేంద్రాల్లో మాత్రమే లైబ్రరీల సేవలు అందుబాటులో ఉండటం, మారుమూల ప్రాంతాల్లోని నిరుపేద అభ్యర్థులు ఇక్కడికి వచ్చి చదువుకోవడం కష్టంగా మారింది. వీరి సమస్యలకు చెక్ పెట్టాలని భావించిన ప్రభుత్వం పౌర పఠన కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సేవలను విస్తరించే చాన్స్ ఉంది. జిల్లాలోని పది మేజర్ గ్రామ పంచాయతీలు, శివారు మున్సిపాలిటీల్లోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించిన అధికారులు వీటిని సుందరంగా ముస్తాబు చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ద్వారా స్టడీ మెటిరియల్ సరఫరా చేయగా, స్థానిక సంస్థల ద్వారా ఫర్నిచర్, కరెంట్, ఫ్యాన్లు, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చారు. పఠన కేంద్రాల నిర్వహణ బాధ్యతలను స్థానిక సంస్థలకే కట్టబెట్టారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలు నోటిఫికేషన్లు జారీ చేసింది. జిల్లా నుంచి సుమారు లక్షన్నర మంది పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరిలో చాలా మంది చదువుకునేందుకు కనీస వసతులు లేని మారుమూల ప్రాంతాల్లోనే ఉన్నారు. వీరి కోసం మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పౌర పఠన కేంద్రాలను గురువారం విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి ప్రారంభించనున్నారు. వీటితో పాటు వాసుదేవపూర్, తిమ్మాపూర్, రావిర్యాల, బాలాపూర్, గాయిత్రినగర్‌లలోనూ త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. నిరుద్యోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

విగ్రహ భూమిపూజకు ముహూర్తం చూడండి



దేవతల గుట్టపై స్థల పరిశీలన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

- దేవతల గుట్టపై భారీ హనుమంతుడి విగ్రహం ఏర్పాటు చేస్తాం
- మంత్రి సబితారెడ్డి
- నాయకులతో కలిసి స్థల పరిశీలన

బడంగ్‌పేట్: విశేష చరిత్ర కలిగిన దేవతలగుట్ట స్వయం భూ దేవాలయంపై 30 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ప్రసిద్ధిగాంచిన దేవతలగుట్టను బుధవారం ఆమె సందర్శించారు. గుడిలో స్వయంభూగా వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులతో విగ్రహ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలన్నారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో చేయూతనిస్తున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ సంపాదించే దాంట్లో కొంత మొత్తాన్ని దైవ కార్యక్రమాలకు ఖర్చు చేయాలని సూచించారు. అనాథలను ఆదుకోవాలని, నిరుపేదలకు చేతనైన సాయం చేయాలని ఆకాంక్షించారు. దేవతల గుట్టను అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. వేదపండితుల సలహా మేరకు మంచి రోజు చూసి భూమి పూజకు ఏర్పాట్లు చేయాలని ఆర్కిటెక్చర్, ఆలయ కమిటీ సభ్యులను ఆదేశించారు. మూడు నెలల్లో పనులు పూర్తి కావాలని సూచించారు. బాలాపూర్ సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ కళ్లెం నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌గౌడ్, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, హరిగౌడ్, ఎస్‌కె.ఖలీల్‌పాషా, తిమ్మని గిరీశ్, నాగ సందీశ్వర్‌రెడ్డి, ఎల్మేటి సుమంత్‌రెడ్డి, మున్నా, వంగేటి అశ్విన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

ఆహార భరోసా

- రేషన్ లబ్ధిదారులకు ఏడాది పాటు ఉచిత బియ్యం
- కేంద్రం వాటా కింద ప్రతి నెలా ఐదు కిలోల చొప్పున పంపిణీ
- రాష్ట్ర ప్రభుత్వం సానుకూల ప్రకటన చేస్తే పది కిలోలకు పెరిగే చాన్స్

జిల్లాలో రేషన్ దుకాణాలు	919
ఆహార భద్రత కార్డులు	5,24,122
అంత్యోదయ	35,195
అన్నపూర్ణ	43
లబ్ధిదారులు	17.48 లక్షల మంది
ప్రతినెలా బియ్యం కోటా	11 వేల మెట్రిక్ టన్నులు

షాద్‌నగర్: రేషన్‌కార్డు ఉన్న పేదలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కరోనా కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆహార భరోసా కల్పించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మరో ఏడాది పాటు పౌరసరఫరాల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించింది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఈ చేయూత అందిస్తామని తెలిపింది. మోదీ సర్కార్ నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఈనెల నుంచే ప్రారంభం

కరోనా నేపథ్యంలో పేదలను ఆదుకునేందుకు 2020 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. ఇప్పటి వరకు కేంద్రం 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం 5 కిలోల బియ్యాన్ని ఫ్రీగా అందజేశాయి. ఈ కోటా గత నెల డిసెంబర్‌తో ముగిసింది. ఇదిలా ఉండగా మళ్లీ కరోనా వ్యాపిస్తోందనే వార్తల నేపథ్యంలో మరో ఏడాది పాటు ఉచిత బియ్యం పంపిణీని కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం అందించే కోటాపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం సానుకూల నిర్ణయం ప్రకటిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

రేషన్ సరుకుల విడుదల

ఇబ్రహీంపట్నం రూరల్: జనవరి మాసానికి సంబంధించిన రేషన్ సరుకులు విడుదలయ్యాయని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాథోడ్ తెలిపారు. ఈనెల 7నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఆహార భద్రత కార్డు ఉన్న వారిలో ఒక్కొక్కరికి పది కేజీలు, అంత్యోదయ లబ్ధిదారులకు కార్డుపై 35 కేజీల బియ్యం ఉచితంగా అందజేస్తామన్నారు. అంత్యోదయకార్డు కల్గిన వారికి రూ.13.50కు కేజీ చక్కర ఇస్తారని తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 5 కిలోలు, మున్సిపల్ కార్పొరేషన్లలో 2కిలోలు, మున్సిపాలిటీల్లో కిలో చొప్పున గోధుమలు అందజేస్తామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ కోటాపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

కేంద్ర నిర్ణయం హర్షణీయం



కేంద్రం తీసుకున్న నిర్ణయంతో నిరుపేదలకు ఎంతో మేలు చేకూరుతుంది. మరో ఏడాది పాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటన చేయడం హర్షణీయం. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని పొడిగించాలి

– ప్రభు, షాద్‌నగర్

పేదలకు ప్రయోజనం



రెక్కాడితే కానీ డొక్కాడని పేదలకు ఉచిత బియ్యం పంపిణీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. కరోనా నేపథ్యంలో మొదలైన కష్టాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం పేదల పక్షాన గొప్ప నిర్ణయం తీసుకుంది.

– శ్రీశైలం, షాద్‌నగర్

గుణాత్మక బోధనలో రాజీపడొద్దు

- పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలి
- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు
- నందివనపర్తిలో మండల స్థాయి టీఎల్‌ఎం మేళా



నందివనపర్తి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

యాచారం: మెరుగైన విద్యాబోధనతోనే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు, హాజరు శాతం పెరుగుతుందని, ఈ విషయంలో ఉపాధ్యాయులు ఏమాత్రం రాజీ పడొద్దని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. నందివనపర్తి ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి బోధనాభ్యసన సామగ్రి మేళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. ప్రతీ ఉపాధ్యాయుడు బోధనాభ్యాసంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన టీచింగ్ అందుతోందని మంత్రి సబితారెడ్డి అభినందించారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని టీచర్లకు పిలుపునిచ్చారు. పదో తరగతి వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు బాగా చదివేలా చూడాలన్నారు. ఇప్పటినుంచే ఎగ్జామ్స్ కోసం సీరియస్‌గా ప్రిపేర్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచగలిగితే గవర్నమెంట్ స్కూళ్లలో అడ్మిషన్లు కూడా దొరికే పరిస్థితి ఉండదని తెలిపారు. అనంతరం పలు పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన టీచింగ్, లర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, ఎంఈఓ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ ఉదయశ్రీ పాల్గొన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచర్ల పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ బషీర్‌బాగ్‌లోని విద్యాశాఖ మంత్రి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. మరోవైపు బీఈడీ చేసిన అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల, ఎయిడెడ్, ఆదర్శ, కస్తుర్బాగాంధీలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల భర్తీకి తక్షణమే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీని ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

చిక్కడపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎం.నరసింహులు డిమాండ్ చేశారు.

ఫార్ములా– ఈ రేస్ టికెట్ల అమ్మకాలు షురూ

- రూ.1000 నుంచి రూ.10 వేల వరకు
- బుక్ మై షో ద్వారా విక్రయాలు

సాక్షి, సిటీబ్యూరో: మోటారు స్పోర్ట్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా– ఈ వరల్డ్ చాంపియన్‌షిప్ రేస్ టికెట్ల అమ్మకాలు బుధవారం ప్రారంభమయ్యాయి. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తొలి టికెట్ కొనుగోలు చేసి అమ్మకాలను లాంఛనంగా ప్రారంభించారు. నెక్లెస్‌రోడ్డులోని 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌లో ఫిబ్రవరి 11న ఈ పోటీలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎలక్ట్రిక్ రేస్ కార్‌లలో 8 సీజన్స్ పూర్తయ్యాయని, 9వ సీజన్‌లో 4వ లెవల్ పోటీలకు హైదరాబాద్ వేదికగా నిలిచిందని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా గుర్తింపును పొందిన హైదరాబాద్ నగరం ఈ– మొబిలిటీకి గ్లోబల్ డెస్టినేషన్‌గా మారనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అక్బర్ ఇబ్రహీం, దేశంలో మొదటిసారి హైదరాబాద్‌లో ఫార్ములా– ఈ పోటీలను పరిచయం చేస్తున్న సంస్థ ఏస్‌నెక్స్ట్ జనరేషన్ (ఏసీఈ ఎన్ఎక్స్‌టీజీఈఎన్) సీఈఓ దిల్‌బాగ్‌జిల్, కిరణ్‌రావు పాల్గొన్నారు.

మొత్తం 22,500 టికెట్‌లు..

- ఫార్ములా– ఈ రేస్ కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయనున్నారు. 25వేలకు పైగా సీట్ల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటిలో 22,500 సీట్లకు మాత్రమే టికెట్‌లను విక్రయించనున్నారు.
- బుక్ మై షో, ఏస్ నెక్స్ట్‌జెన్.కామ్ ద్వారా టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. నాలుగు కేటగిరీల్లో టికెట్‌లు లభిస్తాయి. రూ.1000 విలువైనవి సుమారు 5000 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా మిగతావి రూ.3500, రూ.6000, రూ.10వేల చొప్పున విక్రయించనున్నారు.

సందర్శకులకు అనుమతి....

- ఫిబ్రవరి 11న ఉదయం 10.40 గంటలకు క్వాలిఫైయింగ్ రేస్ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల వరకు పోటీలు కొనసాగుతాయి. ఈ సందర్భంగా నెక్లెస్‌రోడ్డుతో పాటు నగంలోని ప్రధాన కూడళ్లలో 10 భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తారు. పోటీలకు ముందు రోజు ఫిబ్రవరి 10న సాధారణ సందర్శకులను, స్కూల్ పిల్లలను సైతం అనుమతిస్తారు. ఫార్ములా– ఈ పోటీల దృష్ట్యా ఫిబ్రవరి 6నుంచి 11 వరకు నగరంలో ఈ– మొబిలిటీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.
- నెక్లెస్‌రోడ్డు మార్గంలో ఫిబ్రవరి 8వ తేదీ సాయంత్రం నుంచి 11వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తారు. ఆ మార్గంలో వెళ్లే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తారు.



టికెట్ల అమ్మకాలను ప్రారంభిస్తున్న హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రుద్రకుమార్

కొత్తూరు: రవాణారంగంలోని కార్మికులకు ప్రభుత్వం సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రుద్రకుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తిమ్మాపూర్ శివారులో బుధవారం నిర్వహించిన ఐటీసీఎల్ డ్రైవర్స్, వర్కర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రవాణారంగ కార్మికుల సంఘర్షణ యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రుద్రకుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. 2019 ఆర్టీసీ వాహనచట్టాలను చూపుతూ కార్మికులకు నష్టం వాటిల్లకుండా సంస్థలో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరిని పర్మనెంట్ చేయాలని కోరారు. అవసరం ఉన్న చోట కార్మికుల అడ్డాలను ఏర్పాటు చేసి వారికి కార్మికశాఖ ద్వార ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, శ్రీను, రాజు, శక్రు, గోవింద్, చెన్నయ్య, రాములు, కృష్ణ, లింగం, యాదయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ ఫ్రీ రాష్ట్రమే సీఎం లక్ష్యం

- రాచకొండ సీపీ దేవేందర్ సింగ్



దామోదర్ గుప్తాను సత్కరిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: తెలంగాణ ముఖ్యమంత్రికి రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక విజన్ ఉందని అభివృద్ధితో పాటు డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతోనే పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహాన్ అన్నారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ అవరణలో రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని గృహనిర్మాణ సంస్థ చైర్మన్ దామోదర్ గుప్తా, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నరేష్ రెడ్డి, శ్రీనివాస రావులతో కలిసి పరిశీలించారు. త్వరలో భవనాన్ని ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల విషయంలో కొత్త కాలనీలు, కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, యువతను ఇన్‌వాల్వ్ చేయనున్నట్లు తెలిపారు. రాచకొండ పరిధిలో కొత్తగా లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ, డీసీపీ ట్రాఫిక్ రెండు పోస్టులు మంజూరయ్యాయన్నారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దామోదర్ గుప్తలను సత్కరించారు.

PUBLIC NOTICE

By virtue of Gazette No.6, land in Survey Nos.85, 86, 87, 88, 89 Admeasuring Ac.5-24 Guntas, Ac.11-32 Guntas, Ac.12-23 Guntas, Ac.14-09 Guntas, Ac.14-01 Guntas, Total admeasuring Ac.58-09 Guntas along with others lands situated at Kongarakhurd "A" Village, Maheshwaram Mandal, Ranga Reddy District, belonging to my clients C. Mahdava Reddy and Others is notified as Wakf property. My client along with others filed W.P.No.21059 of 2007 in which the Hon'ble High Court passed status quo with regard to possession which is subsisting. This apart multiple litigations are pending. On the basis of fabricated documents E. Narsimha & Nakka Rajesh, M/s. ENCUBE VENTURES applied for layout from HMDA and managed to get a letter for approval lay of out. This was challenged by my clients in W.P.No. 44651 of 2022. The Hon'ble High Court by order dated 13-12-2022 directed the H.M.D.A. to examine under Section 22 of the Act and ascertain whether there is any suppression or misrepresentation. The H.M.D.A. has also informed Hon'ble High Court that the above said persons failed to pay required amount. The General Public here by cautioned not to deal with above said persons.

Sd/- **VIJAY B PAROPAKARI, DANDU PRABHU GOUD**
Advocates
H.No.11-15-24/2/B/501, Flat No.501, B-Block, Hima Sai Pujitha Apartments, Doctors Colony, Saroornagar, Hyderabad-35. T.S.
Cell: 9912024499, 7013210013, 8897153762





కందుకూరు: రాచులూరులో క్రీడాప్రాంగణంలో వాలీబాల్ ఆడుతున్న కేంద్ర బృందం సభ్యులు, మంచాల: మహిళా రైతుతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

ఉపాధి హామీ పనులు భేష్

కేంద్ర బృందం కితాబు

కందుకూరు: జాతీయ ఉపాధిహామీ పథకం కింద అమలవుతున్న పనులను పర్యవేక్షించడానికి మండల పరిధిలోని రాచులూరులో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మరియు అడ్వైజర్ చైర్‌పర్సన్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు ప్రధాన మంత్రి కార్యాలయం సెక్రెటరీ అమర్‌జిత్‌సిన్హా ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ ప్రవీణ్‌మెహతా, ఎన్‌ఐఆర్‌డీ పీఆర్ శాఖ ప్రొఫెసర్ జ్యోతి సత్యపాలన్ బృందం గ్రామ పరిధిలో ఉపాధిహామీ కింద చేపట్టిన పనులను పరిశీలించింది. పల్లె ప్రకృతి వనం, శ్రీశైలం హైవే, రాచులూరు ఆర్ అండ్ బీ రహదారికి ఇరువైపులా చేపట్టిన మొక్కల పెంపకం, కమ్యూనిటీ ప్లాంటేషన్, నర్సరీ పెంపకం, పండ్ల తోట పెంపకం, కొత్తకుంటలో పూడికతీత పనులను పర్యవేక్షించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించి సరదాగా వాలీబాల్ ఆడారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీనివాస్‌చారి అధ్యక్షతన ఉపాధిహామీ కూలీలు, డ్వాక్రా మహిళలతో ముఖాముఖి సమావేశమై వారి జీవన స్థితిగతులలో ఎలాంటి మార్పులు వచ్చాయో అడిగి తెలుసుకుని, వారు తెలిపిన సమాచారంతో సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సీపీఆర్–ఆర్‌డీ డైరెక్టర్ హన్మంత్‌రావు, రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ వీఎస్‌ఎన్‌వీ ప్రసాద్, జాయింట్ కమిషనర్ ఎస్‌వీ ప్రదీప్‌కుమార్‌శెట్టి, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఓ పి.ప్రభాకర్, డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ బి.నీరజ, ఎంపీపీ జ్యోతిపాండు, ఏపీడీ సక్రియనాయక్, డీఎల్‌పీఓ అమృత, సీఆర్‌డీ ఎస్‌పీఎం మురళీధర్, ఎంపీఓ విజయలక్ష్మి, ఏపీఓ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచాల మండల కేంద్రంలో..

మంచాల: ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులు, పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు బుధవారం కేంద్రం బృందం మంచాల మండల కేంద్రంలో పర్యటించింది. సర్పంచ్ జగన్‌రెడ్డితో నర్సరీ నిర్వాహణ విషయాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సౌజన్యంతో నర్సరీ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వివరించారు. సామూహిక శ్మశాన వాటిక, గడ్డం స్వరూప అనే మహిళ రైతుకు సంబంధించిన పశువుల షెడ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కృత్రిమ ఎరువులకు బదులుగా పశువుల పేడ ఉపయోగిస్తున్నామని దీంతో ప్రతీ పంటకు రూ.2వేలు ఖర్చు తగ్గిందన్నారు. అనంతరం ఆండాలు అనే మహిళ రైతు వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన ఫాంపండ్‌ను పరిశీలించి ఉపయోగాలను తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు ప్రధాన మంత్రి సలహాదారుడు అమర్‌జీత్ సిన్హా, ప్రొఫెసర్ అశోక్ పంకజ్(న్యూఢిల్లీ), నేషనల్ కౌన్సిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీల్‌దేశాయ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆర్థిక ముఖ్య సలహాదారుడు ప్రవీణ్ మెహంతో, కేంద్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ సభ్యుడు ప్రొఫెసర్ జ్యోతీసత్యపాలన్, జిల్లా అడిషన్‌కలెక్టర్ ప్రతీక్‌జైన్, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీపీ నర్మద, మండలంలోని వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సహకారంతోనే కూల్చివేతలు

సీపీఐ రాష్ట్ర నాయకుడు పర్వతాలు



తొలగించిన నిర్మాణాలను పరిశీలిస్తున్న పర్వతాలు

కొత్తూరు: పోలీసుల సహకారంతోనే స్టోన్‌క్రషర్ల నిర్వాహకులు జేపీదర్గా–సిద్ధాపూర్ రోడ్డులో పలు నిర్మాణాలను తొలగించారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు ఆరోపించారు. బుధవారం ఆయన బలవంతంగా తొలగించిన కట్టడాలను పరిశీలించి బాధితులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా కేవలం స్టోన్‌క్రషర్లకు వెళ్లే వాహనాల రాకపోకల కోసం వేస్తున్న రోడ్డుకు పోలీసులు ఎందుకు అంతగా సహకరిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛందంగా చిరు వ్యాపారులు కొద్దిమేర నిర్మాణాలను తొలగించినప్పటికీ పూర్తిగా తీసేయాలని ఎందుకు హుకూం జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. క్రషర్ల నిర్వాహకులతో కుమ్మక్కై ట్రాఫిక్, పోలీసు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చిరు వ్యాపారులకు నష్టం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల నుంచి దర్గా ఆవరణలో బొమ్మలు, ఇతర దుకాణాలను పెట్టుకుని జీవనం సాగిస్తున్న వారు అనధికార రోడ్డు విస్తరణ కారణంగా ఉపాధి కోల్పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు దుకాణాల్లో ఉండగానే ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా కూల్చివేతలకు పాల్పడడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఐ ముందుండి పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధితులు షకీల్, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బడుగుల అభివృద్ధి

ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్



ప్రదీప్‌గౌడ్‌కు కేక్ తినిపిస్తున్న నర్సింహ

షాద్‌నగర్‌రూరల్: రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని దేవిగ్రాండ్ మీటింగ్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రదీప్‌గౌడ్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 28 ఏళ్లుగా దళితుల హక్కులు, అభివృద్ధి కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజల పక్షాన అనేక ఉద్యమాలను చేపట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. దళిత బహుజనులు రాజ్యాధికారం దిశగా పోరాడాలని పిలుపునిచ్చారు. బడుగుల ఓట్లతో గెలిచిన నాయకులు ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో ఇరు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకుల పేదలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తామని చెప్పారు. అనంతరం ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చిన్నోళ్ల అనంతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సురేశ్, బాల్‌రాజ్, రవికుమార్, శ్రీకాంత్, ఆనంద్, అశోక్, శ్రీను, శ్రీనివాస్, మల్లేశ్, నాగభూషణ్, శ్రీనివాస్, ప్రశాంత్, రవీందర్, సత్తయ్య, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

రాయితీలతో రాజీ పడొద్దు



సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల తదితరులు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని ప్రభుత్వం
- సచివాలయాలు కాదు.. విద్యాలయాలు నిర్మించాలి
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

బడంగ్‌పేట్: 'పార్టీలకతీతంగా బీసీలంతా సంఘటితం కావాలి. రాయితీలతో రాజీపడకుండా.. రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి. ముఖ్యమంత్రి పీఠం, సామాజిక న్యాయం సాధించుకునే వరకు ఐకమత్యంగా ముందుకుసాగాలి' అని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పాలమూరు నుంచి పట్నం వరకు డిసెంబర్ 2వ నుంచి చేపట్టిన పోరుయాత్ర బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేటకు చేరుకుంది. ఈ సందర్భంగా సామల పాపిరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వస్తే విద్య, వైద్యాన్ని జాతీయం చేస్తామని చెప్పిన కేసీఆర్.. తొమ్మిది సంవత్సరాలు అయినా.. ఇచ్చిన హామీని అమలు చేయకుండా.. పేద విద్యార్థుల చదువులకు గండి కొడుతున్నారని, అర శాతం ఉన్న వాళ్ల దగ్గర అరవై శాతం ఉన్న బీసీలు చేతులు జోడించి అడుక్కోవాల్సిన దుస్థితి రావడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు.

కళాశాలల్లో మరుగుదొడ్ల కరవు

మూడేళ్లుగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. స్కాలర్ షిప్, మెస్‌చార్జీలు పెరిగినా.. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచడం లేదని ఆరోపించారు. విద్యార్థులను పొమ్మనకుండా ప్రభుత్వం పొగ పెడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలోని బీసీ గురుకులాలు, కళాశాల, వసతిగృహాలు, ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలి కాని.. సచివాలయాలు, కలెక్టర్ భవనాలు కాదని దుయ్యబట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బాలికలకు మరుగుదొడ్లు కూడా లేని దుస్థితిలో ఉండటం బాధాకరమన్నారు. దీనికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను జనాభా దమాషా ప్రకారం పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు రావులకోల్ నరేశ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ విక్రంగౌడ్, శ్యాంకురుమ, రవికృష్ణగౌడ్, విజయ్, మణికంఠచారి, వెంకటేశ్, నవీన్, రాకేష్, రంజిత్, సాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

7న బీజేపీ కార్యకర్తల సమ్మేళనాలు

తుక్కుగూడ: టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను, మోసాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల7న రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మీడియా రాష్ట్ర కన్వీనర్ వి.సుధాకర్‌శర్మ అన్నారు. బుధవారం ఆయన తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అర్హులందరికీ ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు మదన్‌మోహన్‌గుప్తా, కౌన్సిలర్ బాకి విలాస్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంతలో దొంగల చేతివాటం

ఎనిమిది ఫోన్‌లు చోరీ చేసిన దుండగులు

కొందుర్గు: మండల పరిధిలోని రామచంద్రాపూర్ సంతలో దొంగలు చేతివాటం చూపుతున్నారు. ఇక్కడ ప్రతీ బుధవారం వారంతపు సంత నిర్వహిస్తున్నారు. ఈ సంతలో చుట్టుపక్కల గ్రామాల రైతులు కూరగాయల దుకాణాలు ఏర్పాటుచేస్తారు. ఈ మర్కెట్లో కొనుగోలుకు వందలాది మంది ప్రజలు వస్తుంటారు. ఇదే అదునుగా భావించిన దుండగులు సెల్‌ఫోన్‌లు, పర్సులు, డబ్బులు కొట్టేస్తున్నారు. ఈ బుధవారం ఏకంగా ఎనిమిది మంది మొబైల్ ఫోన్లు పోయినట్లు స్థానికులు తెలిపారు. రామచంద్రాపూర్‌కు చెందిన ఉస్మాన్ రూ.30వేలు, మొగిలిగిద్దకు చెందిన సాధిక్ రూ.20వేల విలువ చేసే ఫోన్ పోయిందని తమకు ఫిర్యాదు చేశారని కొందుర్గు హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌రాజ్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

యాచారం: ఇబ్రహీంపట్నం వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి రెండు రోజులుగా కనిపించడం లేదు. సీఐ లింగయ్య తెలిపిన ప్రకారం మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామానికి చెందిన ఆవ యాదయ్య(57) ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రెండు రోజులైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

జల్‌పల్లిలో బాలిక..



కాజల్(ఫైల్)

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన సాహు గతేడాది బతుకుదెరువు నిమిత్తం జల్‌పల్లికి వలస వచ్చాడు. రోజు మాదిరిగానే జనవరి 1న సాహు, అతడి భార్య లక్ష్మి పనికి వెళ్లారు. అదేరోజు మధ్యాహ్నం వారి పని వద్దకు వచ్చిన కుమార్తె కాజల్ (17) బోర్‌ఆన్ చేస్తానంటూ వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లభించలేదు. మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోనూ అలీపై అనుమానం ఉందంటూ సాహు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 94906 17241 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

మాడ్గుల: ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు మంగళవారం మృతి చెందాడు. సీఐ కథనం ప్రకారం కొల్కులపల్లికి చెందిన గతేడాది డిసెంబర్ 24న షవ్వ యాదగిరి ట్రాక్టర్ నడుపుతుండగా ట్రాక్టర్ ఇంజన్‌పై ఇరువైపుల బందెల సాలమ్మ, సత్తయ్య దంపతుల కుమారుడు సాయికిరణ్(16), షవ్వ సోమేశ్‌లు కూర్చున్నారు. కొల్కులపల్లి నుంచి నాగిల్ల వైపు వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన సాయికిరణ్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేశామరు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

కేసు నమోదు చేసిన పోలీసులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీకి కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నించినవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన బుధవారం హయత్‌నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం పెద్దఅంబర్‌పేట్‌లోని 123, 124, 197 సర్వే నెంబర్లలో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీకి కేటాయించారు. 2021 జూన్ 23 నుంచి ఆ భూమి మున్సిపాలిటీ ఆధీనంలో ఉంది. ఆ భూమిలో బోరు వేసి చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు టెండర్లు సైతం పిలిచారు. ఐదు వేలకు పైగా మొక్కలు నాటారు. బుధవారం మొక్కలకు నీరు పెట్టేందుకు మున్సిపాలిటీ సిబ్బంది వెళ్లగా మొక్కలు, పైపులు, పానెల్ బాక్సును ధ్వంసం చేసినట్లు గుర్తించారు. చిన్ని కృష్ణారావుతో పాటుగా కొరివి ప్రవీణ్‌కుమార్, బానోత్ రాజు, ఎస్‌కె నజీర్, వీరల్ రవి మరికొంతమంది భూమిలోకి ప్రవేశించినట్లు గర్తించారు. మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.